# నిశ్శబ్ద సంగీతం

"నీకు పెళ్ళయిందా?" డ్రైవర్ని అడిగాను. ఎదురుగా ఓ మనిషి ఉండి, నిశ్శబ్దంగా ఉండటం నాకు నచ్చదు.

"అయింది సాబ్, ఒక్కసారి కాదు. . మూడుసార్లు" వెనక్కి తిరక్కుండానే చెప్పాడు.

మొదట ఆశ్చర్యం, తర్వాత కుతూహలం నాలో.

పది నిముషాల క్రితం ట్రావెల్ ఏజంట్ ఇతన్ని పరిచయం చేస్తూ "చాలా మంచి డ్రైవర్ సార్! మీరు పదే పదే మంచి డ్రైవర్ కావాలని చెప్పటం వల్ల ఇతన్ని మీకోసం ప్రత్యేకంగా పిలిపించాను. ఔరంగాబాద్‌లోని ట్యాక్సీ డ్రైవర్లందరిలోకి ఇతనే బెస్ట్" అంటుంటే చాలా నిరాసక్తంగా విన్నాను. అంతా హంబక్ అని నాకు తెల్సు. ఇక్కడి చారిత్రాత్మక ప్రదేశాల్ని చూపించి, క్షేమంగా హోటల్‌కి చేర్చగల వాడైతే చాలు. బెస్ట్ అక్కరలేదు. ఇతని పేరు కూడా ఏదో చెప్పినట్లు గుర్తు. నేనే సరిగ్గా వినలేదు.

"నీ పేరేమిటి" అని అడిగాను అతనివైపు చూస్తూ. నేను సీటుకి చివరిగా కొంత డోర్ మీద ఒరిగి కూచుని ఉండటంవల్ల అతని ఒక పార్శ్వం నాకు స్పష్టంగా కన్పిస్తోంది.

"నా పేరు 'ముస్తఫా' సాబ్" అన్నాడు. మా సంభాషణ అంతా ఉర్దూలోనే సాగుతోంది.

అతన్ని పరిశీలనగా చూశాను. కుర్రవాడిలానే ఉన్నాడు. వయసు పాతిక దాటి

ఉండదు. సన్నగా పొడవుగా ఉన్నాడు. కోలమొహం. . .కళ్ళలో కదలాడే విషాదం.

నాకెందుకో జాలేసింది. ముస్లిం కదా. మొదట్లో లొట్టలువేస్తూ ఒకేసారి ముగ్గుర్ని పెళ్ళిచేసుకొని ఉంటాడు. ఇపుడు ముగ్గురి మధ్యన నలిగి నరకం చూస్తూ ఉంటాడు. అందుకే అతని కన్రెప్పల మీద వేలాడుతూ ఆ దిగులు.

"మీ మతంలో ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోవచ్చట కదా" అని అడిగాను ఉత్సుకత చంపుకోలేక.

"అందరూ అలానే పొరబడ్తారు సాబ్! మా మతంలో దానికి ఖచ్చితమైన నిబంధన లున్నాయి. అవన్నీ రాజులకూ, నవాబులకూ చెల్లింది. కానీ మాలాంటి గరీబోళ్ళకు కాదు. ఒకర్ని పోషించటమే గగనమైపోయిన ఈ రోజుల్లో అంతమందిని పోషించటం ఎంత కష్టం!"

"మరి, అన్నీ తెలిసి నువ్వెందుకు ముగ్గుర్ని చేసుకున్నావు?"

అతను విషాదంగా నవ్వాడు. ఇంతటి విషాదం వెనుక వ్యధాభరితమైన కథ తప్పకుండా ఉండి ఉంటుంది.

"నేను ముగ్గుర్నీ ఒకేసారి చేసుకోలేదు సాబ్! నాకు మూడుసార్లు నిఖా అయింది. మొదటి నిఖా నా ఇరవయ్యో యేట జరిగింది. ఆమె పేరు ఫాతిమా. అప్పుడామెకు పదహారో, పదిహేడో ఉంటాయనుకుంటా. చాలా అందంగా ఉండేది. కానీ. . ."

ఔరంగాబాద్ రోడ్లనీ, మనుషుల్నీ, దుకాణాల్నీ పరిశీలిస్తూ అతను చెప్పేది వింటున్నాను. కారు అంబేద్కర్ రోడ్డు దాటి పన్‌చక్కీ రోడ్డువైపుకు తిరిగింది.

"హాయిగా సాగిపోతున్న నా జీవితంలో ఓ రోజు విషాదం విషంలా కమ్మేసింది" అన్నాడు. అతని ఉర్దూ స్వచ్ఛంగా ఉంది. నాక్కొన్ని పదాలు అర్థంకాకున్నా సందర్భాన్ని బట్టి అర్థాన్ని అన్వయించుకుంటున్నాను.

కారు ఆగింది. "అదే పన్‌చక్కీ. చూసి రండి" అన్నాడు.

పన్‌చక్కీ అంటే నీటితో తిరిగే తిరగలి అని అర్థం. లోపల 300 సంవత్సరాల నాటి మర్రి చెట్టుంది. నీళ్ళను పైపుల ద్వారా తీసుకు వచ్చి, కృత్రిమమైన జలపాతం సృష్టించి రాతి తిరగలిని తిప్పి పిండి ఆడించేవారట. ఎంతటి అద్భుతమైన పనితనం! ప్రస్తుతం అవేవీ పనిచేయటం లేదు. శిథిలాల్లా ఉన్నాయి.

"నెక్ట్స్ ఎక్కడికి?" అని అడిగాను కార్లో కూచున్నాక.

"బీబీకా మగ్బరా సాబ్! అచ్చం తాజ్ మహల్‌లానే ఉంటుంది. అది చూసుకున్నాక మనం ఎల్లోరా వెళ్దాం. అజంతా ఇక్కడి నుండి నూట పదికిలోమీటర్లుంది. అది చూడాలంటే పూర్తిగా ఒకరోజు పడ్తుంది. అందుకే అజంతాకి రేపు వెళ్దాం" అన్నాడు.

కొద్దిగా వెనక్కి జారగిలబడి కూచున్నా. "నీ భార్య ఫాతిమాకేమైంది?" అని అడిగాను.

"చచ్చిపోయింది సాబ్! ఆత్మహత్య చేసుకుంది. వాళ్ళు నేనే చంపేశానని కేస్ పెట్టారు. నా భార్యంటే నాకు ప్రాణం. తను చనిపోయేనాటికి మాకో బాబు, పాప. పాపైతే నెలల పిల్ల. తనకెలా మనసొప్పిందో, చంటిపిల్లనీ, రెండు సంవత్సరాలైనా పూర్తిగా నిండని బాబునీ, తనంటే పడి చచ్చే నన్నూ వదిలి వెళ్ళిపోటానికి! ఆత్మహత్య చేసుకునే వాళ్ళందరూ కఠినులూ, క్రూరులూ సాబ్! వాళ్ళకేం హాయిగా వెళ్ళిపోతారు, మనల్ని ఈ దుర్మార్గపు లోకంలో వదిలేసి. . .ఎంతటి నిర్దయా!"

అతని కళ్ళు చెమర్చటం నాకు లీలగా కన్పించింది. అతనిలోని దైన్యం - ఆ కళ్ళలోని నిస్పృహ! ఇలానే ఉంటే ఇతను కూడా ఏదో రోజు ఆత్మహత్య చేసుకోవటం ఖాయం అన్పించింది.

"మీరు తరచూ పోట్లాడుకునేవారా?" నిజం రాబడ్దామని అడిగాను.

"సంసారం అన్నాక ఏవో గొడవలు లేకుండా ఎలా ఉంటాయి? చిన్న చిన్న తగాదాలు, మాటపట్టింపులూ మినహా ఆత్మహత్యకు ప్రేరేపించేంత పెద్ద కొట్లాటలు

ఎప్పుడూ లేవు. మా ఇంట్లో మా అమ్మా, నేనూ తమ్ముడూ ఉండేవాళ్ళం. మా అమ్మ మమ్మల్ని కాయకష్టం చేసి పెంచింది. ఎంతచేసినా తల్లిరుణం తీర్చుకోగలమా చెప్పండి? నన్ను ప్రేమగానే చూసేది. కానీ మా అమ్మ విషయానికొచ్చేప్పటికి, నాకు తెల్సిన ఫాతిమా కాదేమోననిపించేది. అలాంటపుడు ఓ మాటనేవాడిని. కానీ అది చనిపోయాక మా మామ ఏమని కేస్ పెట్టాడో తెలుసా సాబ్! నేను కసాయివాడినట, రోజూ తాగి వచ్చి తన్నేవాడినట. కట్నం ఎక్కువ తీసుకురాలేదని హింసించేవాడినట. ఈ చిత్రహింస భరించలేక ఆత్మహత్య చేసుకుందట''

''చివరికి కేస్ ఏమైంది?''

''రెండు సంవత్సరాలపైనే కేస్ నడిచింది సాబ్! ఈ రెండేళ్ళూ నానా కష్టాలూ పడ్డాం. . . నెలల పాపగా ఉన్న నా కూతుర్ని మా అమ్మే పెంచింది. వాళ్ళ కేస్ బలంగా ఉందని మేం పెద్ద లాయర్‌ని పెట్టుకున్నాం. 'ఎంతగా హింసించకపోతే పసిగుడ్డుని వదిలేసి ఆత్మహత్య చేసుకోవాలన్న తలంపు ఓ స్త్రీకి వస్తుంది?' అని వాళ్ళ లాయర్ వాదించాడు. కానీ అల్లా దయ నా వైపు ఉంది. ఆ రోజు నేను టాక్సీ వేసుకుని షిర్డీ వెళ్ళాను. ఆ రాత్రి అక్కడే హాల్ట్ అయ్యాను. మా అమ్మ, తమ్ముడు కలిసి బంధువుల వూరికి పెళ్ళికెళ్ళారు. ఫాతిమా దూలానికి చీర బిగించి వురేసుకుంది. తలుపు గడియ లోపలినుండే వేసి ఉంది. మా ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కూడా సాక్ష్యం చెప్పారు - నేను ప్రేమగానే చూసుకొనేవాడినని. కేసు కొట్టేశారు. ఎటొచ్చీ లాయరు ఫీజు కోసం ఇల్లు అమ్మాల్సి వచ్చింది.''

బీబీకా మగ్బరా దగ్గిరకు వచ్చేశాం.

ఆరేళ్ళక్రితం తాజ్‌మహల్ చూసినపుడు కలగని అనుభూతి బీబీకా మగ్బరా చూసినపుడు కలిగింది. తాజ్‌మహల్‌కి నకలులా. . . ఇది ఔరంగజేబు కట్టించాడన్న అపోహ ఇన్నాళ్ళూ ఉండేది. తను కుట్టిన టోపీలు అమ్మగా వచ్చిన డబ్బుతో అతిసామాన్య జీవనం సాగించిన ఔరంగజేబు ప్రజాధనాన్ని వెచ్చించి తాజ్‌మహల్ లాంటి కట్టడం కట్టించాడంటే నమ్మబుద్ధేసేది కాదు. నాకు హిస్టరీ అంతగా తెలియదు.

ఇపుడు తెల్సింది దీన్ని ఔరంగజేబు కొడుకు ఆజంషా తన తల్లి జ్ఞాపకార్థం కట్టించాడని. తాజ్‌మహల్‌లా మొత్తం పాలరాతితో కాకుండా సున్నంతో కట్టించిన మూడు వందలయేళ్ళనాటి ఈ కట్టడం ఇంకా చెక్కు చెదరకుండా ఉంది. ఇప్పటి ఇంజనీర్లలో అంతటి అంకితభావం, నిజాయితీ ఏవీ? చుట్టూ అందమైన పూలతోటలు, పక్కన ఎండిపోయిన ఖామ్‌నదీ. . .మనసు కొద్దిగా బరువెక్కింది.

కారులో కూచున్నాక, కొంతదూరం వరకు ముస్తఫా ఏమీ మాట్లాడలేదు. బహుశా నా మూడ్‌ని అర్థం చేసకున్నట్లున్నాడు. కానీ ఎక్కువసేపు నిశ్శబ్దాన్ని భరించలేని నేను "ఎల్లోరా ఎంతదూరం" అని అడిగాను.

"ఇక్కడి నుండి పదహారు కిలోమీటర్లు" అని కొంత ఆగాక, "మీరు బీబీకా మగ్బరా చూశారు కదా సాబ్! అది తల్లిమీది ప్రేమకు చిహ్నం ! నాక్కూడా అమ్మంటే అంతిష్టం. నేను కూడా షాజాదానయితే అటువంటి అద్భుమైన కట్టడం కట్టించి ఉండేవాడిని" అన్నాడు.

నాకతనంటే సానుభూతితో పాటు ఇష్టం ఏర్పడటం ప్రారంభించింది. అమ్మను ప్రేమించ గలవాడే భార్యను కూడా ప్రేమించగలడు.

నేను కూడా నా భార్యను బాగా ప్రేమిస్తాననుకుంటా! ఔరంగాబాద్ వచ్చేముందు పెళ్ళి చూపుల్లో చూసొచ్చిన అమ్మాయి గుర్తొచ్చింది. సన్నగా, నాజూగ్గా బంగారు లతలా. . .

"నా దురదృష్టకరమైన జీవితం గురించి చెప్పి మీకు విసుగు కలిగిస్తున్నానా సాబ్" అడిగాడు ముస్తఫా.

లేదని చెప్పాను. కొందరి జీవితాలంతే! అధైర్యపడకూడదని చెప్పాను. అతను పడిన కష్టాలకు సాటిమనిషిగా నా సానుభూతి తెలిపాను. మాటల్లోనే ఎల్లోరా వచ్చేసింది. టైం ఒంటిగంట దాటింది. ఆకలి జూలు దులుపుకుంటోంది. మహారాష్ట్ర టూరిజంవాళ్ళు నడిపే హోటల్లో, నేనూ, ముస్తఫా భోంచేశాం. ముస్తఫాని ఎంత

బలవంతం చేసినా చాల తక్కువ తిన్నాడు. "కష్టాల్ని తినీ తినీ కడుపు నిండిపోతోంది సాబ్! ఆకలి వేయటంలేదు" అన్నాడు. అతని మీద అంతులేనంత జాలి కలిగింది.

ఏడో శతాబ్ది, తొమ్మిదో శతాబ్ది మధ్య చెక్కబడిన పురాతనమైన గుహలు ఎల్లోరా గుహలు. బౌద్ధ, హిందూ, జైన మతాలకు సంబంధించిన ముప్ఫయ్ నాలుగు గుహలున్నాయి. శిలలకు జీవం పోసినట్లు, రాళ్ళలోని ఆత్మలను తట్టి లేపినట్లు, బండల గుండెల్లో చలనం వచ్చినట్లు . . . . అవి మాట్లాడ్తూ, నృత్యం చేస్తూ నడయాడ్తూ . . ఏనుగులు ఘీంకరిస్తూ . . . .

కొన్నిట్లో బౌద్ధ విహారాలున్నాయి. ఒకే ఒక చైత్యం ఉంది పదో గుహలో. . ఎక్కువగా వజ్రయాన బౌద్ధమతానికి సంబంధించిన శిల్పాలు.

పదహారో గుహని కైలాస్ గుహ అంటారట. ఒకే రాతిలో మలచిన రెండంతస్థుల గుహ. ఇందులో శివుని దేవాలయం ఉంది. ద్రవిడ శిల్ప చాతుర్యంతో చెక్కిన ఈ గుహ కర్ణాటకలోని విరూపాక్ష ఆలయానికి ప్రతిబింబంలా . . . . ఒకప్పుడు ఈ గుహ అందమైన రంగుల్తో అలంకరించబడి ఉండేదట. ప్రస్తుతం వాటి ఛాయలేవీ కనిపించటం లేదు. ఈ గుహకు మూడువైపులా. . .శివుడు రాక్షస సంహారం చేయటం . . . . శివపార్వతులు పాచికలాడ్డం. . . శివుడు మార్కండేయుణ్ణి రక్షించటం. . చెక్కి ఉన్నాయి. రావణాసురుడు కైలాసపర్వతాన్ని ఎత్తడం ఎంత రమ్యంగా చెక్కారో!

ఇరవైఒకటో గుహ నన్ను అమితంగా ఆకర్షించింది. దీన్ని రామేశ్వర గుహ అంటారట. గంగాదేవి మొసలిమీద స్వారీ చేస్తున్నట్లున్న ఆ చెక్కడం. . . గంగాదేవి శరీరాకృతి అందంగా . . . . అద్వితీయంగా . . . . ఆమె పెదవుల మీద అలౌకికమైన ఆ చిర్నవ్వు! ఆ శిల్పకారుడెవడో. . .పాదాభివందనం చేయాలనిపిస్తోంది. ఇదే గుహలో శివపార్వతుల కళ్యాణం, యమునాదేవి, కార్తికేయుల శిల్పాలు ఉన్నాయి.

ఇరవై రెండో గుహ నీలకంఠ గుహ. ఇందులోని శివలింగం నీలంరంగులో ఉండటం విశేషం.

ఒక అద్భుతమైన అనుభూతిని గుండెల్లో దాచుకుని తిరుగు ప్రయాణం అయ్యాను. అపుడు టైం నాలుగు కావస్తోంది.

ముస్తఫా గురించి పూర్తిగా తెల్సుకోవాలన్న తపన మరలా నిద్రలేచింది.

"రెండో పెళ్ళి ఎప్పుడు చేసుకున్నావు" అని అడిగాను.

"పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. అమ్మకేమో వయసుడిగిపోయింది. వంట చేయటం కూడా ఆమెకు కష్టమైపోయింది. ఎన్నాళ్ళని ఆమెను కష్టపెట్టనూ! మొదట్లో చాలా వైరాగ్యంగా ఉండేది. ఆడవాళ్ళంటేనే అయిష్టత. పెళ్ళి అంటే అసహ్యం. కానీ చివరికి అమ్మ పోరు పడలేక , పిల్లల అవస్థలు చూడలేక పెళ్ళికి ఒప్పుకున్నాను.

అమ్మాయిది ఇక్కడికి దగ్గరగా ఉన్న పల్లెటూరు. పేరు హసీనా. . .పేరుకు తగ్గట్టు ఉండదు సాబ్! అలా అని అనాకారి కాదు. ఆమెకు ఇదివరకే పెళ్ళయింది. భర్తతో ఓ నెల కాపురం చేసి, విడిపోయి వచ్చేసింది".

తను రెండో పెళ్ళివాడయినా, తనకు కన్నె పిల్లే కావాలనకుండా భర్తను వదిలేసిన అమ్మాయిని చేసుకున్న అతని పద్ధతి నాకు నచ్చింది.

"నేనా పెళ్ళయి భార్య చచ్చిన వాడిని. ఆమె పెళ్ళయి భర్తను వదిలేసింది. ఇలా అయినా పిల్లల్ని ప్రేమగా చూస్తుందనుకున్నా సాబ్! పెళ్ళయిన నెలకే భర్తను వదిలేసిందంటే వాడెంత దుర్మార్గుడో అనుకున్నా. నేను తనను ప్రేమగా, దయగా చూస్తే నాకు అంకితమై పిల్లల్ని తన పిల్లల్లా కాపాడుతుందనుకున్నా. . .కానీ నా మీద అల్లాకు కనికరం లేదు సాబ్! పెళ్ళయిన పదిహేనురోజులకే నాతో కాపురం చేయలేనని వదిలివెళ్ళిపోయింది."

"మొదటి భర్తను నెలలోనే వదిలి వచ్చిందంటే నీవు ఆమె గురించి పూర్తిగా ఆరా తీశాకే పెళ్ళిచేసుకుని ఉండాల్సింది"

"అదీ చేశాను సాబ్! ఆమె మొదటి భర్తను కల్సుకున్నాను. మంచి కుర్రవాడనే

అన్పించింది. "భాయిసాబ్! దాన్ని చేసుకుంటే మీ జీవితం పాడైపోతుంది" అని గడ్డం పట్టుకొని బతిమాలాడు. నేను వింటేనా . . . . వెధవ మనసు - అతడిని వదిలేసి వెళ్ళిందన్న కక్షతో లేనిపోనివి కల్పించి చెప్తున్నాడనుకున్నాను. అప్పటికే ఆ వూరి పెద్దలందరూ ఆమెకు తలాక్ ఇప్పించి ఉండటంచేత నేను పెళ్ళిచేసుకున్నా. తక్‌దీర్‌లో రాసి ఉంటే ఎవరు మాత్రం ఆపగలరు"

"తర్వాతేమయింది" అని అడిగాను.

"తను కూడా కోర్టులో కేస్ వేసింది - కట్నం కోసం వేధిస్తున్నానని. నా మొదటి భార్య వురేసుకుని చనిపోవటం బలమైన సాక్ష్యంగా వాళ్ళు వాడుకున్నారు. వాళ్ళడిగినంత డబ్బిస్తే కేస్‌ని వెనక్కి తీసుకుంటామని బ్లాక్‌మెయిల్ కూడా. . . నేను కట్నమే తీసుకోలేదు. అలాంటిది వాళ్ళు కట్నం, నగలూ ఇచ్చినట్టూ, అవి నేను తాగి తగలేసినట్లూ కోర్టులో చెప్పారు"

నాకెందుకో అతని బలహీనమైన శరీరం చూస్తే. . . . కోర్టుల చుట్టూ తిరిగితిరిగి, అలా చిక్కి శల్యమైపోయాడేమో ననిపించింది.

"సాబ్! ఔరంగజేబు సమాధి చూస్తారా ? ఇక్కడే ఉంది" అన్నాడు కారు ఆపి.

ఔరంగజేబు మీద నాకు సదభిప్రాయం లేకున్నా అతను గడిపిన సామాన్యమైన, సరళమైన జీవనం, సుఖాలను త్యజించి, కఠినమైన నియమాల్తో బతకటం చాలా నచ్చుతాయి.

ఖుల్దాబాద్ అనే చిన్న వూరది. ఔరంగజేబు కాలంలో ఇది చాలా పెద్ద పట్టణమట. ఔరంగజేబు సమాధి అతను గడిపిన జీవితానికి ప్రతీకగా సామాన్యంగా ఉంది - పేద ముస్లింల సమాధికిమల్లే. ఆ సమాధిలో ఒకప్పటి మొగల్ చక్రవర్తి అవశేషాలున్నాయంటే నమ్మబుద్ధి కానంత సాదాగా. . . . అతను చనిపోయే ముందు ఖచ్చితమైన ఆజ్ఞలు జారీ చేశాడట - తన సమాధి మామూలు మట్టితోనే కట్టాలని. దానిక్కూడా తను టోపీలు కుట్టి, ఖురాన్ ప్రతులను రాసి సంపాదించిన డబ్బు మాత్రమే

ఖర్చుచేయాలని - ఎంతటి నిరాడంబరత! లార్డ్ కర్జన్ కోరిక మీద నిజాం నవాబు దీనిచుట్టూ పాలరాతితో కట్టించిన జాలీ. . . . మనసు ఆర్ద్రతతో నిండిపోయింది. ఓ రకమైన వైరాగ్యంతో కూడా - ఎంతటి చక్రవర్తులైనా ఈ మట్టిలో కల్సిపోవాల్సిందేగా!

చావు తప్పదని తెలిసీ, ఎందుకీ మనిషి కక్షలూ, కార్పణ్యాలూ పెంచుకుంటాడు? ఎందుకిలా మోసాలూ, హత్యలూ చేస్తాడు? ఎందుకింత హీనంగా, దీనంగా నికృష్టంగా బతుకుతాడు?

నాకు ముస్తఫా గుర్తొచ్చాడు. అతని జీవితం అతని ఆధీనంలో లేదు. ఈ కష్టాలూ, కన్నీళ్ళు దైవనిర్ణయాలేమో. ఇలాంటి విధివంచితులు ఎందరో !

స్త్రీల హక్కులూ, స్త్రీ వాదం అనే ఆడవాళ్ళు ముస్తఫాలాంటి మగవాళ్ళ జీవితం గురించి ఎందుకు ఆలోచించరూ? ఎప్పుడూ మగాడి వల్ల దుర్భరమైన ఆడవారి జీవితం గురించేనా? మగవాడి జీవితంతో ఆడుకునే ఆడవాళ్ళో ? ?

హోటల్‌కి తిరిగి వెళ్ళేటపుడు తనమీద హసీనా వేసిన కేస్ ఏమైందో చెప్పాడు ముస్తఫా.

"ఆ కేస్ కూడా నేనే గెలిచాను సాబ్! హసీనా మొదటి మొగుడు కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పాడు. అతని వూరిపెద్దలు కూడా వచ్చి ఆమెకు విడాకులు ఎందుకు ఇప్పించాల్సి వచ్చిందో చెప్పారు. వాళ్ళడిగినంత డబ్బు లివ్వకపోతే, నన్ను జైల్లో పెట్టిస్తామని బెదిరించిన వాళ్ళకు చివరికి నిరాశే మిగిలింది. కోర్టు ఖర్చులకూ, లాయరు ఫీజులకూ నేను అద్దెకి తిప్పుకునే నా స్వంత కారు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇపుడిలా వేరే వాళ్ళ దగ్గిర జీతానికి పనిచేసుకునే దుస్థితి కలిగింది" అన్నాడు.

హోటల్ చేరుకునేటప్పటికి ఐదుగంటల ఇరవై నిముషాలైంది. హోటల్ న్యూ పంజాబ్. . . . రైల్వే స్టేషన్ పక్కనే.

ముస్తఫా చేతిలో వంద రూపాయల కాగితం ఉంచాను - పిల్లలకేమైనా కొనుక్కోమని చెప్పి,

"సాబ్! మీరేమనుకోనంటే నాదో చిన్న కోరిక. మీరోసారి మా ఇంటికి రావాలి. ఇల్లు దగ్గరే. శ్రీ శివాజీనగర్‌లో" అని పట్టుబట్టాడు.

నాక్కూడా వెళ్ళాలనే ఉంది. దార్లో బిస్కెట్ ప్యాకెట్లు, ఓ స్వీట్ ప్యాకెట్ కొన్నాను.

చాలా చిన్న యిల్లు. ఒక పెద్ద గదీ, దాన్నానుకుని చిన్న వంట గదీ . . . .అంతే. అక్కడున్న ఇనుప కుర్చీలో కూర్చున్నాను. బాబూ, పాప కొద్దిగా ఒంగి సలాం చెప్పారు. బాబుకి ఆరేళ్ళుంటాయి. గౌస్ వాడి పేరు. బట్టలన్నీ దుమ్ముకొట్టుకుపోయి ఉన్నాయి. తల మాసిపోయి, రేగిపోయి ఉంది. పాపకు నాలుగేళ్ళుంటాయి. పేరు ఖమ్రున్నీసా. చక్కటి పేరు. పాప కూడా చక్కగానే ఉంది.

వంటగదిలోంచి టీ తనే తెచ్చిచ్చాక, భార్యను పిల్చి నాకు పరిచయం చేశాడు. "నా భార్య ఆలియాబేగం" అని . . . . ఓ క్షణం తలయెత్తి ఆమె ముఖంలోకి చూశాను. మనిషి పల్చగా, తెల్లగా ఉంది. వయసు కూడా ఏమంత ఎక్కువ ఉండదు. ఇరవై లోపే . కళ్ళకు కాటుక పెట్టుకున్నందు వల్లనుకుంటాను - అవి వెడల్పుగా కన్పిస్తున్నాయి. ఆ కళ్ళల్లో . . . కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లు . . . కసీ, కోపం - భయం కలిగిస్తూ . . . పులులూ, సింహాలు కూడా ఆ కళ్ళల్లోకి ఓక్షణం చూస్తే బెదిరి-వెనకడుగు వేస్తాయి.

రూంకొచ్చి పడుకున్నానన్న మాటేగానీ, నాకు ఆమె కళ్ళే గుర్తొస్తున్నాయి. కసిగా . . . కోపంగా . . . . అనంతమైన తిరస్కారాన్ని వర్షిస్తూ . . . . అంతులేని అసహ్యాన్ని కురిపిస్తూ . . . .

* * * * *

ఉదయం ఏడింటికే ముస్తఫా వచ్చేశాడు. రాత్రి చాలాసేపు ఆలోచిస్తూ ఉండటం వల్లనుకుంటాను ఉదయాన్నే మెలకువ రాలేదు. నేను తయారయేప్పటికి ఎనిమిదయింది.

అజంతాకి బయల్దేరాం.

నిశ్శబ్దాన్ని హరాయించుకోలేని నేను నిన్న చూసిన ఆలియాబేగం కళ్ళు గుర్తొచ్చి అడిగాను. "ఆలియాబేగంను చేసుకున్నాక జీవితం ఎలా ఉంది" అని

ముస్తఫా విషాదంగా నవ్వాడు.

"మాలాంటి వాళ్ళ జీవితాల్లో ఎప్పుడూ ఏదో వెలితి తప్ప సంతోషం ఉండదు సాబ్! అసలు మూడోసారి పెళ్ళి చేసుకోకూడదనే అనుకున్నాను. కానీ ఓ సంవత్సరం క్రితం నా గురించి దిగులుతోనే అమ్మ చనిపోయింది. తమ్ముడికి పెళ్ళై వేరుగా వెళ్ళిపోయాడు. నాకా డ్యూటీకి వెళ్ళకుండా ఇల్లు గడవదు. ఒక్కోసారి డ్యూటీమీద వెళ్తే రెండుమూడ్రోజులు ఇంటికి రావటానికే కుదర్దు. మరి పిల్లల ఆలనాపాలనా ఎవరు చూసుకుంటారు? అందుకే గత్యంతరం లేక పెళ్ళిచేసుకున్నాను. నాక్కూడా పెళ్ళి అవసరమే కదా సాబ్!" అన్నాడు. అలా అంటున్నప్పుడు కొద్దిగా సిగ్గుపడినట్లు అన్పించింది.

"పిల్లల్ని బాగానే చూసుకుంటుందా"

"ఏం చూస్కోవటం సాబ్! ఎట్లా అయినా స్వంత తల్లికి సాటి ఎవ్వరూ రారు కదా. ఆ లోటు ఎవ్వరూ భర్తీ చేయలేనిది" అన్నాడు.

ఎందుకో అతను ఈమెతో కూడా సంతోషంగా లేడనిపించింది. కొందరి జీవితాలంతే -అభిశప్త జీవితాలు.

అజంతా చేరుకునేప్పటికి పదకొండు గంటలయింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అజంతా గుహల్ని చూడబోతున్న ఉత్కంఠ నాలో. . . . వెయ్యేళ్ళ పురాతనమైన గుహలివి. ఇక్కడ ఇరవై తొమ్మిది గుహల్లోనూ బౌద్ధ మతానికి సంబంధించిన చిత్రాలే ఉన్నాయి. మట్టి, పేడా, తవుడూ కలిపి ముద్దలా చేసి రాతిగోడల మీద పల్చటి పొరలా పూసేవారట. దానిమీద సున్నమూ, నీళ్ళూ కలిపి రాసేవారట. అది ఆరాక ఆకుల్తో, బెరడుతో, మూలికల్తో తయారుచేసిన రంగులు వాడి బొమ్మలు వేసేవారట. ఇన్ని వందల సంవత్సరాలు గడిచినా ఆ రంగుల్లోని మెరుపు తరిగిపోకుండా ఉందంటే



కథా నిలయం
1382
శ్రీకాకుళం

వారి విజ్ఞానానికి జోహార్లు అర్పించాలి . . . . వారి కళానైపుణ్యానికి కైమోడ్పులిడాలి.

అల్చిప్పల్లాంటి కళ్ళతో. . నాజూకైన నడుముతో . . .ఘన వక్షసంపదతో వీటిల్లోని స్త్రీమూర్తుల్ని అద్భుతంగా చిత్రీకరించారు.

మొదటి గుహలోని పద్మపాణి బోధిసత్వుడి బొమ్మ జీవం ఉట్టిపడుతూ ఎంతందంగా ఉందో! పదో గుహలో అందంగా చెక్కిన నలభై స్థంభాలున్నాయి. అందులోని స్థూపంమీద పాలీభాషలో అది క్రీస్తుకు పూర్వం రెండవ శతాబ్దంలో చెక్కినదని రాసి ఉందట. పదహారో గుహలో నందుడు బౌద్ధబిక్షువుగా మారడం, నందుని తల్లి స్పృహ తప్పిపడిపోతే పరిచారిక సపర్యలు చేయటం చిత్రించబడి ఉన్నాయి. అబ్బురపరచే విషయం ఏమంటే ఆ పరిచారిక ఈనాటి నర్సుల యూనిఫాం వేసుకుని ఉండటం! మాయాదేవి తన కల గురించి రాజుగారికి చెప్పటం . . . . జ్యోతిష్కుడు దాని అర్థాన్ని వివరించటం చక్కగా చిత్రీకరించారు.

ఇక్కడి అప్సరసల బొమ్మలు చూసినపుడల్లా నాకు పెళ్ళిచూపుల్లో చూసిన అమ్మాయే గుర్తొస్తోంది. పేరు లావణ్యలత. కనకాంబరం మొగ్గలాంటి ఆమెకు ఆ పేరు సరిగ్గా సరిపోతుంది. ఇంటికివెళ్ళగానే ఉత్తరం రాసి పడేయాలి . . . . ఆ అమ్మాయి నచ్చిందని.

పదిహేడో గుహలో కూడా బుద్ధుని జాతక కథలు బొమ్మలుగా వేశారు. గౌతముడు బుద్ధుడిగా మారి తిరిగి వచ్చాక, యశోధరా, అతని కొడుకు రాహుల్ అతనికి భిక్షపెట్టడం చాలా హృద్యంగా చిత్రీకరించారు. సింహాసనాన్ని, భోగభాగ్యాల్ని, అందమైన భార్యనూ, ముద్దులొలికే కొడుకునీ పరత్యజించి వెళ్ళటం. . . నా మనసు పూజ్యభావంతో నిండిపోయింది.

మొత్తం గుహల్ని అంగుళం అంగుళం - తనివితీరా చూశానన్న తృప్తి. అందుకే రాత్రి చాలా గాఢంగా నిద్రపట్టింది.

* * * * *

ఉదయం ఆరింటికే మెలకువ వచ్చింది. ఈ రోజు షిర్డీ వెళ్ళాలి. నేను ఆరున్నరకే తయారయి ముస్తఫా కోసం ఎదురుచూస్తూ కూచున్నా. ఏడు దాటింది. అతను రాలేదు. ఏడున్నరకు ట్రావెల్ ఏజంట్ నుంచి ఫోన్ వచ్చింది. మరో డ్రైవర్ని ఏర్పాటుచేసినట్లు. ముస్తఫా ఎందుకు రాలేదో? ఆరోగ్యం బాగోలేదేమో? సన్నటి అలజడి నాలో. . . . వేగంగా కిందికి వెళ్ళాను.

"ముస్తఫా ఎందుకు రాలేదు?" అని అడిగాను ట్రావెల్ ఏజెంట్ని.

"నిన్న రాత్రి చాలా ఘోరం జరిగిపోయింది సార్! అతని భార్య అతన్ని రోకలి బండతో బాది చంపేసింది" అన్నాడు ఇంగ్లీషులో. . . .

నేను క్షణ కాలం శిలాప్రతిమలా అయిపోయాను. వెంటనే తేరుకుని, అతను చూపించిన కార్లో కూచుని ముస్తఫా ఇంటికి పోనివ్వమని చెప్పాను.

ఇంటి బైటంతా జనం ! పోలీసులు జనాల్ని అదుపులో పెట్టటానికి పెద్దగా అరుస్తూ, శవాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. శవం దగ్గర అతని ఇద్దరు పిల్లలూ హృదయవిదారకంగా ఏడుస్తున్నారు.

ఇద్దరు ఆడ కానిస్టేబుళ్ల మధ్య కూచుని ఉంది ఆలియాబేగం. ఆమె కళ్ళల్లో కసి మెరుస్తోంది - పదునైన కత్తిలా.

"ఇష్టం లేదని ఎంతమొత్తుకున్నా వినకుండా, ఇద్దరు పిల్లల తండ్రికిచ్చి బలవంతంగా చేశారు పెళ్లి. అందుకే అది తన జీవితంమీద తనే కసి పెంచుకొని ఇలా నాశనం చేసుకుంది" అక్కడ గుమికూడిన ఆడాళ్ళలోంచి ఎవరో మధ్య వయస్కురాలు అంది.

"ఎదురింటి కుర్రాడితో ఉంటే చూసి మొగుడు రాత్రి మందలించాడట. మాటా మాటా పెరిగి. . . . ." మరొకావిడ అంటోంది.

* * * * *

షిర్డీ వైపు కారు వెళ్తోంది.

డ్రైవర్ మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నాడు. ఏ వూరునుండి వచ్చారూ? ఏమేం చూశారు లాంటి ప్రశ్నలు. . . నాకు చిరాగ్గా ఉంది. అశాంతిగా ఉంది. ఎవ్వరితో మాట్లాడాలని లేదు.

"పాటలు పెట్టమంటారా?" అన్నాడు.

"వద్ద"న్నాను.

ముస్తఫా జీవితంలోని విషాదం శబ్దంలా మారి నన్ను వెంటాడుతోంది . . . . క్షణక్షణానికీ పెరిగి భయంకరంగా మారి. . . . అప్రయత్నంగా చెవులు మూసుకున్నాను.

నిశ్శబ్దంగా ఉంటే ఎంత బావుంటుంది !

● విపుల, మార్చి, 1998 ●